సాక్షి
జనగామ

శనివారం । 27 । జూలై । 2024



ప్రమాదఘంటికలు మోగిస్తున్న గోదావరి

గోదావరి పెరుగుతూ ప్రమాద ఘంటికలను మోగిస్తున్నది. రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక దాటింది. - 10లో▸



సేంద్రియ ఎరువులతో పర్యావరణ పరిరక్షణ

పర్యావరణ పరిరక్షణకు రైతులు సేంద్రియ ఎరువులు వాడాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం
$32^0/25^0$

వాతావరణం

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చల్లని వాతావరణం ఉంటుంది. జిల్లాలో అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సమయంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

రాజ్యాంగంపై అవగాహన అవసరం



లింగాలఘణపురం: ప్రతీ పౌరుడికి రాజ్యాంగంపై అవగాహన అవసరమని కే.ఆర్. జస్టిస్ ఫోరం ఫౌండర్ అండ్ సీఎండీ, హైకోర్టు లోక్ అదాలత్ జడ్జి కందుల రాంనర్సయ్య అన్నారు. రాజ్యాంగం, విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, సామాజిక న్యాయం అనే అంశాలపై చేపట్టిన అవగాహన యాత్రలో భాగంగా శుక్రవారం జీడికల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హెడ్మాస్టర్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ పొందాలని అన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్మాస్టర్ మల్లికార్జున్, కోఆర్డినేటర్ సత్యం తదితరులు పాల్గొన్నారు.

డీఎఫ్‌ఓగా రాణాప్రతాప్



జనగామ: జిల్లా మత్స్య శాఖ(డీఎఫ్‌ఓ) అధికారిగా ఎస్.రాణాప్రతాప్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జనగామ జిల్లా ఆవిర్భావం తర్వాత 2016లో మొదటి డీఎఫ్‌ఓగా 34 రోజుల పాటు పనిచేసిన ఆయన తిరిగి 2022లో ఆరు నెలలు విధులు నిర్వర్తించారు. ఇక్కడ పనిచేస్తూనే డిప్యూటేషన్‌పై మహబూబ్‌నగర్ జిల్లాకు వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటేషన్లను రద్దు చేయడంతో తిరిగి సొంత జిల్లాకు వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న డీఎఫ్‌ఓ నాగులు కరీంనగర్‌కు బదిలీ అయ్యారు.

జాబ్ మేళాలో 43 మంది ఎంపిక



జనగామ: జిల్లా కేంద్రంలోని ఏకశిల ఐటీఐలో ప్రిన్సిపాల్ చింతల రాజు, ఎల్ అండ్ టీ కన్‌స్ట్రక్షన్స్, కేన్స్ ఎలక్ట్రానిక్స్ కంపెనీల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు 132 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఇందులో ఎల్ అండ్ టీలో 25 మంది, కేన్స్ ఎలక్ట్రానిక్స్‌లో 18 మంది ఉద్యోగాలకు అర్హత సాధించారు. అనంతరం కంపెనీల ప్రతినిధులు కాంతారావు, శిరీష, వరుణ్, హైందవి వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ మేళాను ఎంప్లాయ్‌మెంట్ జిల్లా అధికారి ఎం.మల్లయ్య పర్యవేక్షించారు.

సొంత జిల్లాకు బదిలీ చేయాలి



జనగామ: గత ప్రభుత్వ హయాంలో 317 జీఓ కింద బదిలీ అయిన ఉద్యోగులను తిరిగి సొంత జిల్లాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి.. సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ జిల్లాల వారీగా గిర్దావర్, ఎంఆర్ఐ, ఏఆర్ఐలుగా పనిచేస్తున్న వారిని కలెక్టర్, అదనపు కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారుల వద్ద క్యాంపు క్లర్క్‌లుగా డిప్యుటేషన్ పేరుతో బదిలీ చేశారని, దీంతో మండల స్థాయిలో మిగిలిన గిర్దావర్లపై పనిభారం పెరుగుతోందన్నారు. సాధారణ బదిలీలకు ఈనెల 31 వరకు అవకాశం ఉండడంతో వీఆర్ఏ నుంచి పదోన్నతి పొందిన ఉద్యోగులను సొంత మండలాల నుంచి పక్కనే ఉన్న మరో డివిజన్‌కు పంపించాలని కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర, ఉమ్మడి జిల్లా ప్రతినిధులతోపాటు జిల్లా ఉపాధ్యక్షుడు మహ్మద్ ఖదీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

'ఇంటింటా ఇన్నోవేటివ్'పై అవగాహన కలిగి ఉండాలి

పాలకుర్తి: గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఇంటింటా ఇన్నోవేటివ్ కార్యక్రమంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కోఆర్డినేటర్ కళ్యాణి అన్నారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీఓ రాములు, ఎంపీఓ రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ఏదైనా నూతన ఆవిష్కరణ చేసిన వారి వివరాలు పంపించాలని చెప్పారు. అనంతరం ఇంటింటా ఇన్నోవేటివ్ పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

శునకం.. భయానకం

రూ.30లక్షలతో ఏబీసీ సెంటర్

మున్సిపల్ పరిధి చంపక్‌హిల్స్ డంపింగ్ యార్డు ప్రాంతంలో రూ.30లక్షలతో యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్(ఏబీసీ) నిర్మించారు. ఇందులో ఆపరేషన్ థియేటర్‌తో పాటు ఆఫీస్ రూం, కుక్కలకు ఆపరేషన్ చేసిన తర్వాత ఆరోగ్య పరిరక్షణకు 50 బోన్ల(గదులు)ను ఏర్పాటు చేశారు. ఏబీసీ సెంటర్ పూర్తయినా.. కుక్కలను పట్టుకుని ఆపరేషన్ చేయడంలో జాప్యం జరుగుతోంది. ఈ ప్రక్రియ నిర్వహించడానికి ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో రూ.10లక్షలు కేటాయించారు. ఒక్కో కుక్కకు రూ.1,650 చొప్పున సదరు కాంట్రాక్టర్‌కు చెల్లిస్తారు. కుక్కలను తరలించే వాహనం మినహా.. మిగతా పరికరాలు కాంట్రాక్టర్ సమకూర్చుకోవాల్సి ఉంటుంది.

జిల్లా కేంద్రం జ్యోతినగర్ సాన్ మారియా స్కూల్ ప్రాంతంలో శునకాల గుంపు



వీధికుక్కల స్వైర విహారం

- ఆరు నెలల్లో 1,865 మందికి కాటు
- బెంబేలెత్తుతున్న జిల్లా జనం
- ఏబీసీ సెంటర్ ఉన్నా సేవలు శూన్యం
- రక్షణ చర్యలపై అవగాహన కల్పించాలి : జిల్లా జడ్జి



గాయపడ్డ వేదాంత్



ఎలక్ట్రీషియన్ సత్యం



వృద్ధురాలు

రోజుకు పది మంది..

జిల్లాలో గడిచిన ఆరు నెలల్లో 1,865 మంది కుక్కకాటుకు గురయ్యారు. ఇందులో 1,425 మందికి రెండు డోసుల ఇంజక్షన్లు పూర్తయ్యాయి. శునకాలు దారివెంట వెళ్లే పెద్దలు, పిల్లలు, వృద్ధులపై దాడి చేస్తూ విచక్షణారహితంగా గాయపరుస్తున్నాయి. చేతిలో కర్రలేనిదే బయటకు వెళ్లలేని పరిస్థితి.

జనగామ: వీధి కుక్కలు గర్జిస్తున్నాయి. బాటసారులు.. ద్విచక్రవాహన చోదకులు కనిపిస్తే చాలు వెంబడిస్తూ గుబులు పుట్టిస్తున్నాయి. ఒకటి, రెండు, మూడు ఇలా ఒకే చోట పది నుంచి పదిహేను కుక్కలు చేరి స్వైర విహారం చేస్తుంటే ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. చిన్నారులు, వృద్ధులు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే వణికి పోతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆరు నెలల కాలంలో 1,865 మంది కుక్కకాటుకు గురయ్యారు. జనగామ మున్సిపల్ పరిధిలో యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్(ఏబీసీ) నిర్మించి నెలలు గడిచి పోతున్నా నేటికీ ఆపరేషన్లు ప్రారంభించ లేదు. కుక్కల పునరుత్పత్తిని నియంత్రించడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా పురపాలిక అధికారులు మాత్రం పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

జనగామ మున్సిపాలిటీతో పాటు జిల్లాలోని 12 మండలాల పరిధిలో ప్రజలకు కుక్కల నుంచి ప్రమాదం పొంచి ఉంది. ఇటీవలి కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా కుక్కల దాడులతో ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లడంపై హైకోర్టు సైతం ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో కుక్కల సంచారంతో న్యాయవాదులు, కక్షిదారులు, సిబ్బంది, పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ప్రజలకు ప్రమాదం ఉందని స్వయంగా జిల్లా న్యాయమూర్తి డి.రవీంద్రశర్మ అధికారులతో సమీక్ష నిర్వహించడం.. పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. కుక్కలు దాడి చేసే సమయంలో ఎలా తప్పించుకోవాలనే విషయమై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వాటి సంతాన ఉత్పత్తిని నిరోధించడానికి ఆపరేషన్లు చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా, పట్టణంలోని బాలాజీనగర్, ధర్మకంచ, కురుమవాడ, పాతబీటు బజారు, బీరప్పగడ్డ, నెహ్రూపార్కు ఏరియా 60ఫీట్ల రోడ్డు, అంబేడ్కర్‌నగర్, గ్రేయిన్‌మార్కెట్, జ్యోతినగర్, శ్రీనగర్ తదితర కాలనీల్లో వందలాది కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. జనం వందల సంఖ్యలో కుక్కకాటుకు గురవుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు.

ఈనెలలో జరిగిన దాడులు..

- పాలకుర్తి మండలం వావిలాలలో ఇంటి ముందు కూర్చున్న సత్తూరు సంపత్, సోమక్క, అనపర్తి రామానుజం, గద్దల ఎల్లమ్మపై పిచ్చికుక్క దాడి చేయగా వారు తీవ్రంగా గాయపడ్డారు.
- చిల్పూర్ మండలం కృష్ణాజిగూడెంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ సత్యం బస్టాప్ వద్ద నిలబడి ఉండగా కుక్కలు గుంపుగా వచ్చి విచక్షణా రహితంగా దాడి చేయడంతో బొటన వేలు తెగిపోయింది.
- నష్కల్‌లో ఇంటిముందు ఆడుకుంటున్న ఎనిమిదేళ్ల వయసు బాలుడు కనుకటి వేదాంత్‌పై కుక్కలు దాడి చేయడంతో చేతులు, కాళ్లకు తీవ్రంగా గాయాలయ్యాయి.
- బచ్చన్నపేటలో దుర్గాప్రసాద్, బాలవ్వ, ముత్తయ్య, పడమటికేశ్వాపూర్‌లో జి.భాను, సదాశివునిపేటలో మనోజ్, పోచన్నపేటలో సంజీవ్, కొడవటూర్‌లో కనకయ్య, బోనకొల్లూరులో మల్లేశం, తమ్మడపల్లిలో రుత్విక్, రామచంద్రం, సాల్వాపూర్‌లో వర్షిత, కొన్నెలో జయమ్మ, ఇటికాలపల్లిలో చంద్రయ్య, ఆలీంపూర్‌లో పోచమ్మ, నాగిరెడ్డిపల్లిలో మహేష్, బండనాగారంలో ఉమేష్ కుక్కల దాడిలో గాయపడ్డారు.

పునరుత్పత్తిని నిరోధించాలి..



అంబేడ్కర్‌నగర్, ధర్మకంచ, సంజయ్‌నగర్, వీవర్స్‌కాలనీ ఇలా అనేక కాలనీల్లో వందల సంఖ్యలో కుక్కలు ఉన్నాయి. వీటితో ప్రజల ప్రాణాలకు ముప్పు ఉంది. వృద్ధులు, పిల్లలు ఒంటరిగా బయటకు రాలేని పరిస్థితి. శునకాల పునరుత్పత్తిని నిరోధించాలి.

- మల్లిగారి రాజు, అంబేడ్కర్‌నగర్, జనగామ

వెంటపడుతున్నాయి..



ఉదయం, రాత్రి సమయంలో ఇంటికి రావాలంటే భయంగా ఉంది. కాలనీలోని ప్రధాన వీధుల్లో పదుల సంఖ్యలో కుక్కలు గుంపులు గుంపులుగా చేరి.. బైక్‌లు, కాలినడకన వెళ్లే వారి వెంటపడుతూ పరుగులు పెట్టిస్తున్నాయి.

- దొంతుల భిక్షపతి, శ్రీనగర్‌కాలనీ, జనగామ



శాకంబరీగా అమ్మవారు దర్శనం

జనగామ: పట్టణంలోని బతుకమ్మకుంట శ్రీ విజయ దుర్గామాత ఆలయంలో శుక్రవారం అమ్మవారు శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన పూజారి ఆరాధ్యశర్మ ఆధ్వర్యాన అమ్మవారికి తీరొక్క కూరగాయలతో తయారు చేసిన మాలలు అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పాడి పంటలు సమృద్ధిగా, అన్ని వర్గాల ప్రజలు చల్లంగా ఉండేలా దీవించు తల్లీ అని వేడుకున్నారు. అనంతరం దుర్గామాతకు అలంకరించిన కూరగాయలతో వంటలు తయారు చేసి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 2వ వార్డు కౌన్సిలర్ వాంకుడోతు అనిత తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు వాయిదా..

జనగామ రూరల్: పాలకుర్తి మండలం బొమ్మెర గ్రామంలో శనివారం నిర్వహించే అగ్రి లీగల్ ఎయిడ్ న్యాయవిజ్ఞాన సదస్సును వాయిదా వేస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రవీంద్రశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నామని, తదుపరి నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జనగామ రూరల్: అర్హులైన లబ్ధిదారులందరికీ రెండు పడకల ఇళ్లు మంజూరు చేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రిజ్వాన్ బాషా అధ్యక్షతన రెండు పడక ఇళ్ల నిర్మాణంపై రెవెన్యూ, ఇంజనీరింగ్, గృహ నిర్మాణ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో 1,145 ఇళ్లకు గాను 615 టెండర్ దశలో ఉన్నాయని, పూర్తయిన ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ త్వరగా చేపట్టాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై సమీక్షించారు. నిరుపేద పిల్లలు, గర్భిణులకు మెరుగైన సేవలందించడంతో పాటు మారుమూల ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో పర్యటించాలని చెప్పారు. పోషణ్ అభియాన్, బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు.

పూర్వ ప్రాథమిక విద్యకు అధిక ప్రాధాన్యత

జిల్లాలో పూర్వ ప్రాథమిక విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా తెలిపారు. ప్రతీ అంగన్వాడీ కేంద్రం ద్వారా పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నామని చెప్పారు. సొంత భవనాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో రూ.36 వేల చొప్పున వెచ్చించి త్వరలో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. పోషణ్ ట్రాక్ యాప్ ద్వారా రోజువారీ అటెండెన్స్ నమోదు చేస్తున్నామని, ప్రతి కేంద్రంలో కిచన్ గార్డెన్ ఏర్పాటు చేశామన్నారు. సఖి కేంద్రం ద్వారా వివిధ రకాల 960 కేసులకు గాను 887 పరిష్కరించామని, మిగతా వాటిని త్వరలో పరిశీలించి పరిష్కరించనున్నట్లు వివరించారు. పిల్లల దత్తత, ఆపరేషన్ ముస్కాన్, బాల్యవివాహాల నిలిపి వేతకు సంబంధించి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆ సమావేశంలో అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్, ఆర్డీఓలు కొమురయ్య, వెంకన్న, గృహనిర్మాణ శాఖ నోడల్ అధికారి దామోదర్, ఈఈ నరేందర్‌రెడ్డి, డీఈ కృష్ణకుమార్, ఏఈలు రమేష్, వెంకటనర్సు, జిల్లా సంక్షేమాధికారి జయంతి, ఆర్‌డీఓ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పక్కన కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు

పర్యావరణ పరిరక్షణపై బాధ్యత పెరగాలి

- జిల్లా విద్యాధికారి రాము

జనగామ రూరల్: విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై బాధ్యత పెరిగేలా వారిని భాగస్వాములను చేయాలని జిల్లా విద్యాధికారి కె.రాము అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏకశిల బీఎడ్ కాలేజ్‌లో శుక్రవారం తెలంగాణ జాతీయ హరితదళం, పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పులు, సాంకేతిక విభాగం, భారత ప్రభుత్వం, తెలంగాణ విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఎల్ఈడీ ట్యూబ్ లైట్లు, కంపోస్టు తయారీ వర్క్‌షాప్ నిర్వహించారు. పరిశీలకుడిగా రాష్ట్ర హరితదళం ప్రాజెక్ట్ అధికారి విద్యాసాగర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలబాలికలు రెండు అడుగుల ఎల్ఈడీ ట్యూబ్ లైట్ తయారు చేశారు. హరితదళం ఎకో క్లబ్ 50 పాఠశాలల విద్యార్థులు(ముగ్గురు చొప్పున) 150 మంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో అతి తక్కువ శక్తి వినియోగంతో పనిచేసే ఎల్ఈడీ లైట్ల గురించి, కంపోస్ట్ తయారీ విధానంపై అవగాహన కల్పించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారీ సమయంలో మిగిలే కూరగాయలు, వంటకాలు, తడి చెత్త వంటి వాటిని కంపోస్టుగా తయారు చేశారు. అనంతరం వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హరితదళం జిల్లా ప్రాజెక్ట్ అధికారి గౌసియా బేగం తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాపులో సర్టిఫికెట్లతో విద్యార్థులు

వ్యాధులపై అవగాహన కల్పించాలి

- డీఎంహెచ్ఓ హరీశ్‌రాజ్

రఘునాథపల్లి: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్ఓ హరీశ్‌రాజ్ వైద్యులు, సిబ్బందికి సూచించారు. వారం వారం నిర్వహించే డ్రై డే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన మండల కేంద్రంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాకాలంలో వీధులు, ఖాళీ ప్రదేశాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా, పరిసరాల పరిశుభ్రత, దోమ తెరల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. నీటి కుళాయిలు, పాత టైర్లు, కూలర్లు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ బాటిళ్లు, పనికిరాని వస్తువులలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. జ్వర బాధితులు ఉంటే వెంటనే తగిన చికిత్స, సలహాలు అందించాలని తెలిపారు. న్యుమోనియా, వాంతులు, విరేచనాలు ఉంటే స్థానిక పీహెచ్‌సీకి వచ్చేలా ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రాలు, ఆశ కార్యకర్తల వద్ద మందులు అందుబాటులో ఉంచాలని మండల వైద్యాధికారి కమల్‌హసన్‌కు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్లాన్ మీడియా అధికార ప్రతినిధి ప్రభాకర్, హెల్త్ అసిస్టెంట్లు విష్ణువర్ధన్ రెడ్డి, పందరి తదితరులు పాల్గొన్నారు.



వైద్యులు, సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్ఓ హరీశ్‌రాజ్

'కాళేశ్వరం'లో కేటీఆర్ బృందం

- కాళేశ్వరాలయం, కన్నెపల్లి పంప్ హౌస్, మేడిగడ్డ బ్యారేజ్ సందర్శన..
- ప్రాజెక్టు ఇంజనీర్లను వివరాలు అడిగిన తెలుసుకున్న కేటీఆర్
- గోదావరి ప్రవాహం, పంపింగ్ సాధ్యాసాధ్యాలపై ఆరా
- ప్రాజెక్టు వద్దే మీడియా సమావేశం.. కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై ఆగ్రహం
- కాళేశ్వరం పంపుల ద్వారా వెంటనే నీళ్లు లిఫ్ట్ చేయాలని డిమాండ్
- నాలుగు గంటల పాటు సాగిన పర్యటన



లక్ష్మీ పంపుహౌస్ వద్ద కేటీఆర్, మాజీ మంత్రులు సత్యవతిరాథోడ్, సబితాఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, మల్లారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, కమలాకర్, ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు తదితరులు

సాక్షి ప్రతినిధి, వరంగల్/కాళేశ్వరం: బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు బృందం కాళేశ్వరం ప్రాజెక్టుల్లో బిజీబిజీగా పర్యటించింది. గురువారం కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో పర్యటించిన ఈ బృందం శుక్రవారం ఉదయం మంచిర్యాల జిల్లా ఇందారం గుండా జేఎస్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కన్నెపల్లి(లక్ష్మి) పంపుహౌస్‌కు చేరుకుంది. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రాజెక్టులు, రిజర్వాయర్లను సందర్శించామని ప్రకటించిన కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, జి.జగదీశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, గంగుల కమలాకర్, చామకూర మల్లారెడ్డి, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, సత్యవతిరాథోడ్, కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, కోరుకంటి చందర్, సుంకె రవిశంకర్, కోవ లక్ష్మి తదితరులు ఉన్నారు. మేడిగడ్డ బ్యారేజ్, కన్నెపల్లి పంపుహౌస్‌లను సందర్శించిన బృందం సుమారు నాలుగు గంటల పాటు బిజీబిజీగా గడిపింది.

కాళేశ్వరాలయం నుంచి పంపుహౌస్‌కు..

బీఆర్ఎస్ బృందం సభ్యులు ముందుగా శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయానికి ఉదయం 10.02 గంటలకు చేరుకోగా.. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అక్కడ పూజలు చేశారు. త్రివేణి సంగమ గోదావరి నదికి సారెతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కన్నెపల్లిలోని లక్ష్మీపంపుహౌస్‌కు 10.45గంటలకు చేరుకున్నారు. చెడిపోయిన స్థానంలో బిగించిన పంపులను చూశారు. ఇరిగేషన్ ఇంజనీర్లతో మాట్లాడారు. ఎస్ఈ కరుణాకర్, ఈఈ తిరుపతిరావు బీఆర్ఎస్ బృందానికి లక్ష్మీ పంపుహౌస్‌లోని మోటార్లు, పంపుల గురించి వివరించారు. ప్రాణహిత ద్వారా లక్షల క్యూసెక్కుల వరద వస్తుంటే.. ఎందుకు లిఫ్ట్ చేయడం లేదని కేటీఆర్ అధికారులను అడిగారు. ఇందుకు ప్రభుత్వ నిర్ణయం, ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు లిఫ్ట్ చేస్తామని ఇరిగేషన్ అధికారులు బదులిచ్చారు. అక్కడి నుంచి నేరుగా గోదావరి నుంచి అప్రోచ్ కెనాల్ ద్వారా ఫోర్‌బే వద్దకు వచ్చే వరద నీటిని పరిశీలించారు. అక్కడ కొద్దిసేపు మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. 11.50గంటలకు కన్నెపల్లి నుంచి మేడిగడ్డ బ్యారేజ్‌కు బృందంతో వెళ్లారు. బ్యారేజ్ గుండా తరలిపోతున్న వరద నీటిని పరిశీలించారు. బ్యారేజ్ పైనుంచి సారెను గోదావరికి సమర్పించి పూజ చేశారు. బ్యారేజ్ 7వ బ్లాక్‌లో గత ఏడాది అక్టోబర్ 21న కుంగిన 20వ పియర్ వద్దకు చేరుకొని పరిశీలించారు. అక్కడ మళ్లీ మీడియాతో మాట్లాడారు. గంటకు పైగా మేడిగడ్డ బ్యారేజ్ వద్ద పరిశీలించి 1.50 గంటలకు మంచిర్యాల జిల్లా క్యాతనపల్లికి వెళ్లారు.

పంపింగ్ చేయకపోవడంపై ఆగ్రహం..

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. కాళేశ్వరం నుంచి నీళ్ల పంపింగ్ నిలిపివేతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ దురుద్దేశం కోసం ప్రజలు, రైతులపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తారు. ఆగస్టు 2వ తేదీ లోపు కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని మోటార్లను ఆన్ చేసి నీటిని ఎత్తిపోయకుంటే 50 వేల మంది రైతులతో కలిసి మోటార్లను మేమే ఆన్ చేస్తామని అల్టిమేటం ఇచ్చారు.

పోలీసుల పహారా..

బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర బృందం కాళేశ్వరం పర్యటన జిల్లా పోలీసులు పహారాలో కొనసాగింది. డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి, సీఐలు, ఎస్సైలు, సివిల్, టీఎస్ఎస్‌పీ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కాళేశ్వరానికి మొదటిసారి కేటీఆర్..

రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మొదటిసారి కాళేశ్వరాలయంతోపాటు కన్నెపల్లిలోని లక్ష్మీపంపుహౌస్‌కు వచ్చారు. ప్రాజెక్టు నిర్మాణ భూమిపూజ సమయంలో, ఎత్తిపోతలు ప్రారంభించిన సమయంలో కూడా రాలేదు. తొలిసారి వచ్చిన ఆయనను చూసేందుకు స్థానికులు పోటీపడ్డారు.

మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడి మధ్య వాగ్వాదం

కాళేశ్వరాలయంలోకి కేటీఆర్, నాయకులు వెళ్తుండగా.. దారికి అడ్డుగా ఉన్నావంటూ మంచిర్యాలకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు బేరి సత్యనారాయణతో చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వాగ్వాదానికి దిగాడు. 'నువ్వెంత అంటే నువ్వెంత' అంటూ ఒకరినొకరు దుర్భాషలాడుకున్నారు. ఈ విషయం ఆలయం వద్ద తీవ్ర చర్చనీయాంశమైంది.



త్రివేణి సంగమం వద్ద గోదావరికి సారె సమర్పిస్తున్న కేటీఆర్ తదితరులు



కాళేశ్వరాలయంలో నంది విగ్రహం వద్ద కేటీఆర్ తదితరులు

ట్రైబల్ డిక్లరేషన్ అమలుచేయాలి

- బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రాంకోటి

జనగామ రూరల్: ట్రైబల్ డిక్లరేషన్ ప్రకటించి అమలు చేయాలని బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రాంకోటి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ ఏఓ రవీందర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్‌తో పాటు పోడు భూములకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. బంజారా జాతీ కోల్పోతున్న సంప్రదాయాలను పరిరక్షిస్తూ రాజ్యాంగ హక్కులను కాపాడాలన్నారు. జనాభా ప్రాతిపదికన ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని, తండాల అభివృద్ధికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సంక్షేమ శాఖ అధికారి లేకపోవడం దారుణమని, ఐటీడీఏ ఏర్పాటు చేయాలని, గిరిజనులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, నరేష్, కిషన్, పరమేష్, రాజు పాల్గొన్నారు.



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

క్లుప్తంగా

కేయూ బీఫార్మసీ సెమిస్టర్ పరీక్షలు షురూ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని బీఫార్మసీ మొదటి సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాలలో ఈ పరీక్షల నిర్వహణ తీరును కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నాగరాజు పరిశీలించారు. వీరి వెంట కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ప్రసాద్ ఉన్నారు.

కొనసాగిన రిజిస్ట్రేషన్ల జోరు

కాజీపేట అర్బన్: వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో శుక్రవారం రిజిస్ట్రేషన్ల జోరు కొనసాగింది. గురువారం 246 దస్తావేజులు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోగా ఖజానాకు 2.10కోట్ల ఆదాయం సమకూరగా, అదే జోరులో శుక్రవారం కొనసాగి 229 దస్తావేజులను సబ్ రిజిస్ట్రార్లు రాజు, అమ్జద్ పూర్తి చేశారు. దీంతో ఖజానాకు రూ.కోటి 90లక్షల ఆదాయం సమకూరినట్లు సమాచారం. రాత్రి 7.30నిమిషాల వరకు రిజిస్ట్రేషన్లు కొనసాగాయి. శనివారం సైతం ఇదే జోరు కొనసాగే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

కుక్కకాటుతో మహిళ మృతి



పూలమ్మ(ఫైల్)

మరిపెడ: మానుకోట జిల్లా మరిపెడ మండలం ఎడ్జర్లకు చెందిన మహిళ కుక్క కాటుకు గురై చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ నెల 5వ తేదీన ఎడ్జర్లకు చెందిన జంగం పూలమ్మ(40) గ్రామంలో నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో వీధికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. అయితే అదే రోజు గ్రామానికి చెందిన చిన్నారి నారమల్ల దివ్యను సైతం కుక్క కరవగా ప్రస్తుతం చికిత్స పొందుతోంది.

మహ్మద్‌గౌస్‌పల్లిలో ముగిసిన అశోక్ అంత్యక్రియలు

ములుగు రూరల్: భద్రాద్రి కొత్తగూడెం- ములుగు జిల్లా సరిహద్దుల్లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన నల్లమారి అశోక్ అలియాస్ విజేందర్ అంత్యక్రియలు శుక్రవారం మండలంలోని మహ్మద్‌గౌస్‌పల్లిలో నిర్వహించారు. అశోక్ సొంత గ్రామం భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుద్దారం గ్రామమైనప్పటికీ అతని సోదరుడు నల్లమారి కుమారస్వామి బతుకుదెరువు నిమిత్తం మహ్మద్‌గౌస్‌పల్లిలో నివాసం ఉంటున్నాడు. బుద్దారంలో అశోక్ కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో ఆయన సోదరుడు కుమారస్వామి అశోక్ మృతదేహాన్ని నేరుగా గ్రామంలోని శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రమాదఘంటికలు మోగిస్తున్న గోదావరి

- మూడో హెచ్చరికకు చేరువలో వరద ఉధృతి
- సమ్మక్క సాగర్ వద్ద 84.50మీటర్ల నీటి మట్టం



ఏటూరునాగారం: రామన్నగూడెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

ఏటూరునాగారం: గోదావరి క్రమం పెరుగుతూ ప్రమాదఘంటికలను మోగిస్తుంది. మండలంలోని రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద శుక్రవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి 15.910 మీటర్లకు చేరుకొని రెండో ప్రమాద హెచ్చరికను దాటింది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. గ్రామాల్లో గోదావరి రెండో ప్రమాద హెచ్చరికను టాంటాం చేశారు. గోదావరి వరద 17.360కి మీటర్లకు చేరితే అధికారులు మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేయనున్నారు. లోతట్టు ప్రాంతాలైన ఓడవాడ, మానసపెల్లి, రామన్నగూడెం, రామ్ నగర్ గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు లోతట్టు ప్రాంతాల ప్రజలను దాటించడానికి మరపడవలతో గోదావరి వద్ద సిద్ధంగా ఉన్నారు. ఇదిలా ఉండగా.. రామన్నగూడెం గోదావరి పుష్కరఘాట్ వద్ద గోదావరి ఉధృతిని ఏఎస్పీ శివం ఉపాధ్యాయ పరిశీలించారు. తహసీల్దార్ జగదీశ్, సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ ఉన్నారు.

సమ్మక్క సాగర్ వద్ద 84.50మీటర్ల నీటి మట్టం

కన్నాయిగూడెం: తుపాకులగూడెం వద్ద గోదావరిపై నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద గోదావరి గత మూడు రోజుల నుంచి తగ్గి గురువారం నుంచి మళ్లీ పెరుగుతోంది. బ్యారేజీలోకి ఉదయం 9,83,500 క్యూసెక్కుల నీరు చేరగా సాయంత్రం 10,74,200క్యూసెక్కులు చేరింది. బ్యారేజీ వద్ద 59గేట్లు ఎత్తి అదే మోతాదులో నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 84.50మీటర్ల నీటిమట్టం ఉంది. దేవాదుల ఇన్‌టెక్ వెల్ వద్ద 86మీటర్ల నీటి మట్టం కొనసాగుతుంది.

ఉధృతంగా ప్రాణహిత..

కాళేశ్వరం: కాళేశ్వరం వద్ద ప్రాణహిత నది ఉధృతంగా ప్రవహిస్తుంది. శుక్రవారం కాళేశ్వరం వద్ద గోదావరితో కలిసి పుష్కరఘాట్‌ను తాకుతూ 12.100మీటర్ల ఎత్తులో నీటి ప్రవాహం కొనసాగింది. దీంతో దిగువన అంబట్‌పల్లిలోని మేడిగడ్డ(లక్ష్మీ)బ్యారేజీకి వరద చేరుతోంది. అక్కడ బ్యారేజీలోకి 9,89,600లక్షల క్యూసెక్కుల వరద వస్తుంది. దీంతో మొత్తం 85గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. కాగా, అన్నారం బ్యారేజీ వద్ద 16వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. బ్యారేజీలోని 66గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు.



వాజేడు: రహదారికి అడ్డంగా ఉంచిన దుంగ



వెంకటాపురం(కె):బోదాపురం వద్ద బ్రిడ్జిపైకి చేరిన గోదావరి వరద

రాకపోకలకు అంతరాయం

వెంకటాపురం(కె): గోదావరి వరద ఉధృతితో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం.. ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. శుక్రవారం సాయంత్రానికి మండల పరిధిలోని బోదాపురం బ్రిడ్జి పైకి, వీరభద్రవరం గ్రామ సమీపంలోని కుక్కతోగు వాగు వద్ద గోదావరి వరద రోడ్లపైకి చేరింది.

తగ్గినట్టే తగ్గి పెరుగుతున్న గోదావరి

వాజేడు: పేరూరు వద్ద గోదావరి వరద ఉధృతి తగ్గినట్టే తగ్గి పెరుగుతోంది. గురువారం సాయంత్రం 16.10మీటర్లకు తగ్గిన గోదావరి వరద శుక్రవారం సాయంత్రానికి 17.49మీటర్లకు చేరుకుంది. పూసూరు-ఎడ్జర్లపల్లి, వాజేడు-గుమ్మడి దొడ్డి, పేరూరు-చంద్రుపట్ల, కోయవీరాపురం, రహదారులపై గోదావరి వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. అధికారులు మండలంలో 14 పునరావాస కేంద్రాలను సిద్ధం చేసి ఉంచారు. వాజేడు, గుమ్మడిదొడ్డి రహదారిపై అడ్డంగా దుంగలను ఉంచారు.

సేంద్రియ ఎరువులతో పర్యావరణ పరిరక్షణ

- టెస్కాబ్ చైర్మన్ రవీందర్ రావు



మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

హన్మకొండ: పర్యావరణ పరిరక్షణకు రైతులు సేంద్రియ ఎరువులను వాడాలని తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ ఆపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. శుక్రవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని డీఎల్‌కే బాంక్వెట్‌హాల్‌లో స్పిక్ గ్రీన్ ఫర్టిలైజర్స్ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో రవీందర్ రావు ముఖ్య అతిథిగా మాట్లాడారు. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు విచ్చలవిడిగా వాడడం ద్వారా భూసారం, పర్యావరణం దెబ్బ తింటుందన్నారు. పంట ఉత్పత్తుల్లో రసాయన అవశేషాలు చేరి ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. ఈ క్రమంలో సేంద్రియ ఎరువులు వాడడమే శ్రేయస్కరమని సూచించారు. సేంద్రియ ఎరువుల వినియోగంపై పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్న స్పిక్ ఫర్టిలైజర్ కంపెనీని అభినందించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం శ్యామ్, స్పిక్ మార్కెటింగ్ మేనేజర్ సత్యనారాయణ, రీజినల్ మేనేజర్ సుబాన్, డెవలప్‌మెంట్ మేనేజర్ సురేశ్, సహకార సంఘాల సీఈఓలు, మార్క్‌ఫెడ్, ఓడీసీఎంఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుష్ శాఖలో బదిలీలు

- 47 మంది వైద్యులు, 40మంది ఫార్మసిస్ట్‌లకు ఉత్తర్వులు



వైద్యులకు బదిలీ ఉత్తర్వులు అందజేస్తున్న ఆర్‌డీడీ రవినాయక్

కాశిబుగ్గ: హైదరాబాద్‌లో ఈనెల 15, 16న ఆయుష్ శాఖలో బదిలీలు జరగగా శుక్రవారం హనుమకొండలోని వరంగల్ జెడ్పీ ఆవరణలోని ఆర్‌డీడీ కార్యాలయంలో వారికి ఉత్తర్వులను ఆర్‌డీడీ డాక్టర్ రవీనాయక్ అందజేశారు. మల్టీజోన్-1 పరిధిలోని 47మంది వైద్యులు, 40మంది ఫార్మసిస్ట్‌లు, 31 మంది మిగతా జిల్లా కేడర్ సిబ్బందికి ఉత్తర్వులు అందజేశారు. ఇందులో 28మంది ఆయుర్వేద, 13మంది హోమియో, ఆరుగురు యునాని వైద్యులు ఉన్నారు. 47 ఫార్మసిస్ట్‌లలో 22 మంది ఆయుర్వేదం, 12మంది యునాని, 3 హోమియోల్లో బదిలీలు జరిగాయి. వరంగల్‌లోని ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాలకు ఒక వైద్యురాలు, ఇద్దరు ఫార్మసిస్ట్‌లు బదిలీపై వచ్చారు. వైద్యశాలకు చెందిన ఆఫీస్ సూపరింటెండెంట్ ఆర్‌డీడీ కార్యాలయానికి వెళ్లగా, ఆర్‌డీడీ ఆఫీస్‌కు చెందిన ఆఫీస్ సూపరింటెండెంట్ఇక్కడికి బదిలీపై వచ్చారు.

సైబర్ మోసం.. రూ.92వేలు మాయం



వివరాలు వెల్లడిస్తున్న బాధితుడు శ్రీనివాస్

మహబూబాబాద్ రూరల్: ఉన్నట్టుండి ఓ వ్యక్తి ఖాతా నుంచి రూ.92వేలు మాయమైన ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన వీణా ఫ్యాన్సీ కంగన్ హాల్ నిర్వాహకుడు శేషాగని శ్రీనివాస్ గురువారం రాత్రి తన సెల్ ఫోన్ ఇంట్లో పెట్టి బయటకు వెళ్లాడు. కొంత సమయానికి వచ్చి సెల్ ఫోన్ చూడగా అప్పటికే నిమిషాల వ్యవధిలో రూ.60వేలు, మరోసారి రూ.32వేలు డెబిట్ అయినట్లు సమాచారం వచ్చింది. దీంతో సైబర్ మోసం జరిగినట్లు గుర్తించి బాధితుడు ఆ వెంటనే సైబర్ క్రైం నంబరు 1930కు, మహబూబాబాద్ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అందజేశాడు. అయితే కొంతకాలంగా శ్రీనివాస్‌కు వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు మరో నంబర్‌కు ఫార్వర్డ్ అవుతున్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం.

ముగిసిన ధార్మిక ప్రవచనాలు



శ్రీవేంకటాచల ధార్మిక ప్రవచనం చేస్తున్న కృష్ణకుమార్

హన్మకొండ కల్చరల్ : హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలా పార్క్ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా జరుగుతున్న శ్రీ వేంకటాచల ధార్మిక ప్రవచనాలు శుక్రవారం రాత్రి ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ప్రవచకులు శ్రీమండలిక కృష్ణకుమార్ మాట్లాడుతూ శ్రీవేంకటాచల పుణ్యక్షేత్రాన్ని దర్శిస్తే సమస్యలు తీరి మోక్షమార్గం లభిస్తుందని చెప్పారు. ప్రతీ ఒక్కరు శ్రీవేంకటాచల మహత్యం తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు డింగిరి శ్రీనివాసాచార్యులు, అరుణ, దేవేందర్‌రెడ్డి, ఉపేందర్, కనపర్తి నీరజ, రఘువీర, వంగల సోమయాజు, భక్తులు పాల్గొన్నారు.

ఆటలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా
- ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో సీపీ అంబర్‌కిషోర్‌ఝా, అసోసియేషన్ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్: క్రీడాకారులు నిత్య సాధనతో ఆటలో ఎప్పటికప్పుడు సరికొత్త టెక్నిక్‌లను నేర్చుకుంటూ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 10వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్స్ (అండర్ -17) బాలబాలికల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం ముగిశాయి. గత నాలుగు రోజులుగా హనుమకొండ సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్, భీమారంలోని కిట్స్ కళాశాల ఇండోర్‌లో నిర్వహించిన చాంపియన్‌షిప్ ముగింపు వేడుకలకు సీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆఫీసర్స్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీపీ విజేతలకు ట్రోఫీ, పతకాలు, సర్టిఫికెట్లను అందజేసి, మాట్లాడారు. తెలంగాణ నుంచి అంతర్జాతీయ, ఒలింపిక్స్‌లో పాల్గొన్న క్రీడాకారుల స్ఫూర్తితో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రమేశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పింగిళి రమేశ్‌రెడ్డి, కోశాధికారి నాగకిషన్, నిర్వహణ కార్యదర్శి డాక్టర్ జితేందర్ రెడ్డి, వరంగల్ క్లబ్ కార్యదర్శి రవీందర్‌రెడ్డి, క్రీడా పరిశీలకుడు సుధాకర్, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మోహన్‌రావు, అసోసియేషన్ బాధ్యులు టెక్నికల్ అఫీషియల్స్ కొమ్ము రాజేందర్, వైకుంఠం, రాజ్‌కుమార్, దుర్గాప్రసాద్, విశ్వప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు..

మిక్స్‌డ్ డబుల్స్ బాలుర విభాగంలో..

ఆదిత్య బొమ్మకంటి, రిషితపాండే (రంగారెడ్డి) వర్సెస్ జే.శౌర్యకిరణ్, కీర్తి మంచాల(వరంగల్)ల మధ్య సాగిన తుది పోరులో పాయింట్ల తేడాతో ఆదిత్య, రిషితల జట్టు విజేతగా నిలిచింది.

బాలుర డబుల్స్‌లో..

ఫైనల్ మ్యాచ్‌లో ధృవ పెర్షిద్‌సేతి, వివేక్ బొల్లం (రంగారెడ్డి) జట్టు పై సాయిసిద్ధార్థ రాయప్రోలు, యువసూర్య జాగర్లముడి(హైదరాబాద్) విజయం సాధించారు.

బాలుర సింగిల్స్‌లో..

సాయినాచికేత్ భట్రాజు (మెదక్)పై శశాంక్ వనమాల(రంగారెడ్డి) విజయం సాధించాడు.

బాలికల డబుల్స్‌లో..

లక్ష్మీ రిథిమ దేవినేని, సరయు సూర్యనేని(హైదరాబాద్) వర్సెస్ అనుసంజన మురళీ, శృతి గ్రేస్‌రెడ్డి (రంగారెడ్డి)ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు క్రీడాకారులు విజయం సాధించారు.

బాలికల సింగిల్స్‌లో..

కీర్తి మంచాల (జనగాం).. ఏలూరు అక్షయ చౌదరి (మెదక్)పై గెలుపొందింది.

తప్పుడు సమాచారం ఇస్తే చర్యలు

- అదనపు డీసీపీ రవి



మాట్లాడుతున్న అదనపు డీసీపీ రవి

వరంగల్ క్రైం : ఆదాయ పన్ను రిఫండ్ (ఐటీఆర్) కోసం తప్పుడు వివరాలతో రిటర్న్ సమర్పిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని వరంగల్ పరిపాలన విభాగం అదనపు డీసీపీ రవి తెలిపారు. శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఆదాయ పన్ను రిటర్న్‌పై పోలీస్ అధికారులు, సిబ్బందికి జూమ్ మీటింగ్ ద్వారా అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా ఆదాయపు పన్ను అధికారి మహేందర్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ వేతన ఉద్యోగులు తమ ఆదాయ పన్ను వివరాలను సమర్పించే సమయంలో తప్పుడు మినహాయింపులు, డిడక్షన్లతో ఆన్‌లైన్ రిటర్న్ సమర్పించి రావాల్సిన దానికన్నా ఎక్కువ మొత్తంలో రిఫండ్‌క్లయిమ్ చేస్తున్నట్లు ఆదాయ పన్ను విభాగం నిర్వహించిన దర్యాప్తు వెలుగు చూసిందన్నారు. పోలీస్ ఉద్యోగులు ఆదాయపన్ను రిటర్న్ సమర్పించే సమయంలో పాటించాల్సిన నిబంధనలు, అందజేయాల్సిన పత్రాలు, తప్పుడు వివరాలతో ఆదాయ పన్ను రిటర్న్ సమర్పిస్తే ఆదాయపన్ను చట్టం క్రింద తీసుకునే చర్యలను వివరించారు. ఎక్కువ మొత్తంలో రిఫండ్ ఇప్పిస్తామంటూ ముందుకు వచ్చే దళారులను నమ్మొద్దని సూచించారు. సమావేశంలో అదనపు డీసీపీలు సంజీవ్, సురేశ్‌కుమార్, ఏఓ రామకృష్ణ, స్వామి, ఏసీపీలు, ఆర్‌ఐలు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో లీకేజీలను పరిశీలించిన అధికారులు



లీకేజీలను పరిశీలిస్తున్న అధికారులు

వెంకటాపురం(ఎం): రామప్ప ఆలయ పైకప్పుకు లీకేజీలు ఏర్పడి వర్షపునీరు వస్తుందనే నెపంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం రామప్పను సందర్శించినట్లు దేవాదాయ, ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.సునిత తెలిపారు. రామప్ప ఆలయంలో కురుస్తున్న ప్రదేశాలను పరిశీలించినట్లు వెల్లడించారు. లీకేజీలకు మరమ్మతులు చేపట్టేందుకు కేంద్ర పురావస్తుశాఖ ఉన్నతాధికారులను కోరనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆమె వెంట ఆలయ ఈఓ బిల్లా శ్రీనివాస్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, ఆలయ అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్, సిబ్బంది అవినాశ్‌రెడ్డి, మార్క సంతోష్ ఉన్నారు.

మోటు సరసం !

- లావు కావాలని.. మలద్వారం గుండా గాలి పంపింగ్
- ఆకతాయి చేష్టలతో యువకుడు ఆస్పత్రిపాలు
- మద్యం మత్తులో బావబామ్మర్దుల పరాచకం

ఐనవోలు: బావబామ్మర్ది పరాచకాలు.. ఆటపట్టించుకోవడాలు సాధారణంగా చూస్తుంటాం.. కానీ, ఏకంగా ఓ బావబామ్మర్దుల జంట సరసం పరాకాష్టకు చేరింది. దీంతో ఓ వ్యక్తి ఆస్పత్రి పాలయ్యాడు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలో జరిగిన ఈ ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్, ఒంటిమామిడిపల్లికి చెందిన ఓ మెకానిక్, గూడ్స్ ట్రాలీ డ్రైవర్లు స్నేహితులు. ఐనవోలుకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ (27) ఈ నెల 20వ తేదీన రాత్రి మెకానిక్ షెడ్డులో ట్రాక్టర్ రిపేర్ చేయించుకుంటున్నాడు. అదే సమయంలో మిగతా ఇద్దరు అక్కడకు వచ్చారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న వీరు ఆకతాయి తనంతో ఏం చేస్తున్నామో తెలియని స్థితిలో ఐనవోలుకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్‌ను నువ్వు బక్కగా ఉన్నావు.. లావు కావాలి.. అంటూ గేలి చేస్తూ ఆట పట్టించారు. నీకు గాలి పెట్టి దొడ్డయ్యేలా(లావు) చేస్తాం.. అంటూ పరాచకాలు ఆడుతూ చివరకు బలవంతంగా మెకానిక్ షాపులో ఉన్న హైడ్రాలిక్ ఎయిర్ ప్రెషర్ పైపు మలద్వారం వద్ద ఉంచి ఒక్కసారిగా గాలి వదిలారు. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ పొట్టలోకి గాలి చేరడంతో అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే టాక్టర్ డ్రైవర్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు పెద్ద పేగులోకి గాలి చేరి ఉబ్బిందని ఆపరేషన్ చేయడంతో ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. అయితే సదరు వ్యక్తి ఆహారం తీసుకుని.. మలవిసర్జన చేసే వరకు ఆస్పత్రిలోనే ఉండాలని, ఏదైనా సమస్య వస్తే మరోసారి ఆపరేషన్ చేయాల్సి వస్తుందని డాక్టర్లు చెబుతున్నట్లు సమాచారం. ఆస్పత్రిలో అయ్యే ఖర్చంతా ఒంటిమామిడిపల్లికి చెందిన ఇద్దరు భరిస్తున్నారు. అయితే ఆరు రోజులైనా డిశ్చార్జ్ కాకపోవడంతో విషయం స్థానికంగా అందరికీ తెలిసిపోయి.. చర్చనీయాంశంగా మారింది.

వరంగల్ మీదుగా భారత్ గౌరవ్ రైలు

- ఆగస్టు 4న 'దివ్య దక్షిణ యాత్ర' ప్రారంభం



కాశిబుగ్గ: ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) ఆధ్వర్యంలో భారత్ గౌరవ్ పర్యాటక రైలు వరంగల్ మీదుగా రామేశ్వరం, జ్యోతిర్లింగ, దివ్య దక్షిణ యాత్ర నిర్వహిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ డిప్యూటీ జనరల్ మేనేజర్ కిషోర్ సత్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రైలు ఆగస్టు 4న సికింద్రాబాద్‌లో ప్రారంభమై కాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా తిరువణ్ణామలై(అరుణాచలం) రామేశ్వరం, మధురై, కన్యకుమారి, తివేంద్రం, తిరుచ్చి, తంజావూరు సందర్శన ఉంటుందని తెలిపారు. ఈయాత్ర 8 రాత్రులు, 9 పగళ్లుగా కొనసాగుతుందని ఉదయం టీ, కాఫీ, టిఫిన్, మధ్యాహ్నం తెలుగు భోజనం, సాయంత్రం స్నాక్స్, టీ, కాఫీ రాత్రి టిఫిన్ అందిస్తారని తెలిపారు. క్షేత్రాల సందర్శన సమయాల్లో ప్రత్యేక బస, స్లీపర్ క్లాస్, నాన్ ఏసీ, ఏసీ క్లాసుల వారికి ఏసీ రూమ్‌ల సదుపాయం కల్పిస్తారని తెలిపారు. రైలు ప్రతి బోగీలో ఎస్కార్ట్స్, ప్రయాణికులను దగ్గరుండి దర్శనానికి తీసుకెళ్లడం తిరిగి రైల్లోకి చేర్చే సదుపాయం ఉంటుందని తెలిపారు. రైలులో సీసీ కెమెరాలు, మైక్, లగేజీ భద్రత, ఇన్సూరెన్స్ సౌకర్యం ఉందని తెలిపారు. టికెట్ ఒక్కొరికీ స్లీపర్ రూ.14,250, సెకండ్ ఏసీ రూ.28,450, థర్డ్ ఏసీ రూ.21,900గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అవసరమైనవారు బుకింగ్స్ కోసం 92814 95843, 92814 95845, 82879 32229 మరిన్ని వివరాల కోసం www. irctctourism. com సంప్రదించాలని సూచించారు.

విహారం.. విషాదం కావొద్దు



ఫ్లెక్సీ కడుతున్న సిబ్బంది

వాజేడు: విహార యాత్ర విషాదం కావొద్దని తెలిపే ఫ్లెక్సీలను అటవీ శాఖ సిబ్బంది బొగత జలపాతం వద్ద శుక్రవారం ఏర్పాటు చేశారు. రేంజర్ చంద్రమౌళి ఆధ్వర్యంలో సిబ్బంది బొగత జలపాతం చుట్టూ ఈ ఫ్లెక్సీలను కట్టారు. నీటిలోకి దిగొద్దని, నీటితో జాగ్రత్తగా ఉండాలని తెలిపే ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

బ్యాడ్మింటన్‌లో శౌర్యకిరణం

హనుమకొండ నుంచి అంతర్జాతీయ పోటీలకు..

- చైనాలో జరిగే ఏషియా బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌నకు ఎంపిక



తల్లిదండ్రులు రవికిరణ్, నాగలక్ష్మితో శౌర్య కిరణ్



షటిల్ ఆడుతున్న క్రీడాకారుడు శౌర్య కిరణ్

ఖిలా వరంగల్ : కృషి, పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని నిరూపించాడు.. హనుమకొండకు చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు శౌర్యకిరణ్. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ స్ఫూర్తిగా షటిల్ బ్యాడ్మింటన్‌లో శౌర్యకిరణ్ సత్తా చాటుతున్నాడు. పీటీసీ సీఐగా విధులు నిర్వహిస్తున్న హనుమకొండకు చెందిన రవికిరణ్ కుమారుడు శౌర్యకిరణ్ ఇంటర్ చదువుతున్నాడు. చిన్నతనంలో బ్యాడ్మింటన్‌పై ఉన్న ఆసక్తిని గమనించిన తండ్రి రవికిరణ్ తనతోపాటు గ్రౌండ్‌కు తీసుకెళ్లి సాధన చేయిస్తూ మెలకువలు నేర్పించాడు. దీంతో శౌర్యకిరణ్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడిగా రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొని ఎన్నో పతకాలు సాధించాడు. ఇటీవల రాజస్థాన్ జైపూర్, ఆంధ్రప్రదేశ్ విజయవాడ, కర్ణాటక బెంగళూరు, చెన్నైలో జరిగిన టోర్నమెంట్స్‌లో విజేతగా నిలిచి బంగారు పతకాలు సాధించి, మాజీ సీఎం కేసీఆర్‌తోపాటు పలువురి ప్రశంసలు అందుకున్నాడు. ప్రస్తుతం చైనాలో ఆగస్టు 20 నుంచి 25 వరకు జరిగే ఏషియా బ్యాడ్మింటన్ డబుల్ అండర్-17 చాంపియన్ షిప్ పోటీలకు భారత్ తరపున శౌర్యకిరణ్ ఎంపికయ్యాడు.

విజయమే నా లక్ష్యం

మా నాన్న వద్ద బ్యాడ్మింటన్ ఆడడం నేర్చుకున్నా. పుల్లెల గోపీచంద్ శిక్షణ, ప్రోత్సాహం మరవలేనిది. ఆగస్టులో చైనాలో జరిగే అంతర్జాతీయ టోర్నమెంట్‌లో విజయం సాధించడమే నా లక్ష్యం.

\- శౌర్య కిరణ్

విజయాలు

- 2023లో ఫిబ్రవరి 5 నుంచి మే 12 వరకు రాజస్థాన్ జైపూర్‌లో జరిగిన యూనెక్స్ సన్‌రైజ్ ఇల్‌ఇండియా సబ్‌జూనియర్ (అండర్ 15-17వరకు)టోర్నమెంట్ సింగిల్స్‌లో తృతీయ స్థానం సాధించాడు.
- 2023 నవంబర్ 1 నుంచి 8 వరకు విజయవాడ (ఏపీ)లో జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రతిభ చాటి తృతీయ స్థానంలో నిలిచాడు.
- 2023 నవంబర్ 28 నుంచి డిసెంబర్ 12వరకు కర్నాటక రాష్ట్రం బెంగళూర్‌లో జరిగిన బ్యాడ్మింటన్ డబుల్స్‌లో ప్రథమస్థానంలో నిలిచాడు.
- 2024 జనవరి 27న చెన్నై-2023 ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ఆధ్వర్యంలో డబుల్ బ్యాడ్మింటన్ క్వార్టర్ ఫైనల్, హైదరాబాద్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ -2023 రాష్ట్రస్థాయి పోటీల్లో మిక్స్‌డ్ డబుల్స్‌లో గోల్డ్‌మెడల్ అందుకున్నాడు.
- 2024 జూలై 18 నుంచి 20 వరకు బెంగళూరులో జరిగిన ఏషియా బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ అండర్-17 విభాగం మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రథమ స్థానంలో నిలిచి చైనాలో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు.